క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పోకల రాంబాబు

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శనివారం తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరులో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తవుతోందని, నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని ఆయన వివరించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు ఉన్నారు.

నేడు బాలలకు మధుమేహ నివారణ మందుల పంపిణీ

ఉంగుటూరు: బాలలకు ఉచితంగా మధుమేహ నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు నిమ్స్ డయాబిటీస్ రీసెర్చ్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు తెలిపారు. ఉంగుటూరులో ఆదివారం 18 ఏళ్లలోపు బాలలకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, రక్త పరీక్ష చేసుకునే కిట్లు, ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఎల్‌వీ ప్రసాదు ఆసుపత్రి సిబ్బందితో కంటి ఆసుపత్రిని ఉంగుటూరులో 7 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు కంపెనీలు హైదరాబాదులోని డయాబిటీస్ రీసెర్చ్ సొసైటీకి అందించే ఆర్థిక వనరులతో సుమారు 700 వందల మంది పిల్లలకు 15 ఏళ్ల నుంచి మందులు పంపిణీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ మందులు అవసరమైన వారు పాతూరి వంశీకృష్ణ ఫోన్ నం.9848934365 సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాస్‌కు సత్కారం



ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక కావడం పట్ల దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం శనివారం హర్షం వ్యక్తం చేశారు. కవురు శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి పూలదండ, శాలువాతో సత్కరించారు. బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత స్థానం కల్పించడం సంతోషంగా ఉందని జెడ్పీటీసీ అన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్



పీహెచ్‌సీలో పొంగు,తట్టు రాకుండా వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పిల్లలకు పొంగు, తట్టు వ్యాధులు రాకుండా మీజిల్ రూబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్ పంపిణీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొత్తం పది గ్రామ సచివాలయాల పరిధిలో పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు సీహెచ్‌వో విల్సన్‌బాబు తెలిపారు. పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి పిల్లలకు వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చేబ్రోలు -దూబచర్ల రహదారికి మరమ్మతులు

ఉంగుటూరు: చేబ్రోలు నుంచి దూబచర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి కిలోమీటరు మేర గోతులు పడి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. గోతులను కంకరతో పూడ్చి అనంతరం తారు రోడ్డు పోస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 19వ తేదీ ఆదివారం పాతూరు వద్ద వ్యాన్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో గుండుగొలను గ్రామ శివారు కొత్తగూడెంకు చెందిన మంత్రి అప్పలనాయుడు(45) అక్కడిక్కడే మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలైన కొత్తగూడెంకు చెందిన విసినిగిరి సన్యాసిరావు (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై చావా సురేష్ కుమార్ చెప్పారు.

పాడి రైతుకు అండగా సంచార పశు వైద్యసేవ

- టోల్ ఫ్రీ నంబర్ 1962
- ఫోన్ చేసిన కొద్ది సమయంలోనే పశువైద్య అంబులెన్స్, సిబ్బంది రాక



మేధినరావుపాలెంలో అంబులెన్స్ ద్వారా పశు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది



కొవ్వలి పశువైద్యశాలలో పశువైద్యసేవలపై కరపత్రాలతో ప్రచారం

దెందులూరు: పాడి రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో పాటు మూగజీవాల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశువైద్యసేవ పథకాన్ని అమలు చేస్తోంది. 108, 104 అంబులెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న తరహాలో పశువుల చెంతకు వెళ్లి వైద్య సేవలందించడం వైఎస్సార్ సంచార పశువైద్య సేవ లక్ష్యం. దీనికి ప్రభుత్వం 1962 టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించింది. ఈ నంబరుకు ఫోన్ చేస్తే అరగంటలోపు అంబులెన్స్‌తో వైద్య సిబ్బంది వచ్చి పశువులకు వైద్య సేవలందిస్తారు. ఈ పథకం పాడి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. గత ప్రభుత్వంలో పాడి రైతుల కష్టాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో వారంతా మూగ జీవాలకు వైద్యం అందించలేక అవస్థలు పడేవారు. దీంతో గ్రామాల్లో పశు సంపద కనుమరుగయ్యే స్థితికి చేరింది. ఈ దశలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక రైతుల పక్షపాతిగా వారి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ కళకళలాడుతోంది. పశువైద్య సంచార వాహనంలో వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంటాయి. వైద్యుడు, వెటర్నరీ డిప్లొమో సహాయకుడు, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. 35 రకాల వైద్యపరీక్షలు చేసే వీలున్న ప్రయోగశాల వాహనంలో ఉంటుంది. పశువులకు కాళ్లు విరిగినా, ఈనే సమయంలో లేవలేకపోయినా వాటిని తరలించేందుకు వాహనంలో ప్రత్యేక హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం ఉంటుంది. దెందులూరు నియోజకవర్గంలో రెండు పశు వైద్యశాలలు, 11 డిస్పెన్సరీలు ఉన్నాయి.

నియోజకవర్గంలో పశువుల సంఖ్య	
ఆవులు	9,152
గేదెలు	4,530
మేకలు	1601
గొర్రెలు	13,020

పశువైద్యసేవలు వినియోగించుకోవాలి



టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వాహనంలో సిబ్బంది వచ్చి వైద్యులు వచ్చి ఉచిత సేవలందిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి పశువును ఆసుపత్రికి తరలిస్తారు. సంచార వైద్య వాహనంలో సకల సౌకర్యాలున్నాయి.

– నెహ్రూ బాబు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

విస్తృత ప్రచారం అవసరం



గ్రామ శివారు ప్రాంతాల్లో సంచార పశువైద్యసేవల వినియోగం, టోల్‌ఫ్రీ నంబర్‌పై మరింత ప్రచారం సాగాలి. 108 మాదిరిగా పశువైద్య సేవలు క్షేత్రస్థాయిలో విస్తరించాలి. విస్తృత ప్రచారం చేయాలి. పథకం లక్ష్యం నెరవేరడానికి సమష్టి కృషి అవసరం.

– ఇరుకులపాటి సాంబశివరావు, రైతు, గంగన్నగూడెం

రైతులకు గొప్ప మేలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మానవతవాది. మనుషుల తరహాలో పశువులన్నింటికీ సకాలంలో వైద్యసేవలందించాలన్న ఆలోచన చాలా గొప్పది. గ్రామాల్లో సంచార పశువైద్య సేవా వాహనం అందుబాటులోకి తీసుకురావడం రైతులకు గొప్ప మేలు.

– యలమర్తి సత్తిబాబు, రైతు, పెరుగ్గూడెం

కనక దుర్గమ్మ ఆలయం అభివృద్ధికి కృషి



వైఎస్సార్ సీపీ నాయకులకు టీటీడీ ప్రసాదం అందజేస్తున్న తొత్తడి వేదకుమారి

దెందులూరు: విజయవాడ కనక దుర్గమ్మ ఆలయం అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. పదవీ ప్రమాణ స్వీకారం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వెళ్లి స్వామివారిని దర్శించుకున్నట్టు ఆమె శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని ఆమె స్థానిక వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, మండల జగనన్న సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సంతమార్కెట్ విస్తరణ పనులు

- తీరనున్న భీమడోలు ప్రజల చిరకాల వాంఛ
- శిథిలమైన కాంప్లెక్స్ తొలగింపు



భీమడోలు సంతమార్కెట్ వద్ద సర్వే



వ్యాపారులతో చర్చిస్తున్న గ్రామ కార్యదర్శి



భీమడోలులో శిథిలమైన కాంప్లెక్స్ తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న వ్యాపారులు

భీమడోలు: గ్రామంలోని సంతమార్కెట్ విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో సంత మార్కెట్ సర్వే పనులను గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్ తన సిబ్బందితో కలిసి శనివారం ప్రారంభించారు. భీమడోలు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో సంత మార్కెట్ ప్రాంతంలో 23 ఏళ్ల నుంచి నిరుపయోగకరంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌ను కలెక్టర్ అనుమతులతో తొలగించారు. దీనితో కాంప్లెక్స్‌లోని ఆరు దుకాణాలను తొలగింపుతో సంత మార్కెట్ విస్తరణ, అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. సంతమార్కెట్‌ను భీమడోలు చుట్టు పక్కల ఉన్న 50 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఏటా సంత విస్తరించడంతో రోడ్డుపైనే తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బుధవారం నిర్వహిస్తున్న వారపు సంతలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంత మార్కెట్‌ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టింది. ఈ క్రమంలో సంత మార్కెట్‌కు పెద్ద అడ్డంకిగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు తొలగింపు చేపట్టారు. అదే విధంగా సంతలో ఉన్న చిన్న దుకాణాలను వారి యాజమానులతో మాట్లాడి వారంతా స్వచ్ఛందంగా తొలగించేలా తగు చర్యలు చేపట్టారు. సంత మార్కెట్ ప్రాంతంలోని పంచాయతీ స్థలం, పోరంబోకు స్థల విస్తీర్ణాన్ని గుర్తించేందుకు సచివాలయాల సిబ్బందితో సర్వే పనులు ప్రారంభించారు. ఈ సర్వే పనులు పూర్తి కాగానే ఒకే కేటగిరికి చెందిన దుకాణాలన్నింటినీ ఒకే బ్లాక్‌గా తీసుకుని వచ్చి అక్కడ వారికి స్థలాలను కేటాయిస్తారు. కూర, ఆకు కూరలు, పండ్లు, మాంసపు దుకాణాలకు వేర్వేరుగా కేటాయించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంత మార్కెట్ రూపురేఖలు మార్చనున్నారు. దీనితో భీమడోలు గ్రామ ప్రజలు చిరకాల వాంఛ నెరవేరనుంది.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



వట్లూరులో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

పెదపాడు: మండలంలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఉగాది నాటికి వీలైనన్ని ఎక్కువ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో హౌసింగ్ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు రూ. 4లక్షలకు పైగా విలువైన స్థలాన్ని, రూ.1.80వేల నగదు, స్త్రీ నిధి నుంచి రూ.50 వేల రుణం, బ్యాంకు నుంచి మరో రూ.35వేలు అందిస్తున్నట్లు వివరించారు. సబ్సిడీపై గృహ నిర్మాణ సామగ్రితోపాటు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన సహాయం కావాలన్నా అందించేందుకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి హౌసింగ్ ఏఈ చైతన్య, స్థానిక సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, ఏపీఎం దాసరి సుమలత ఈఓ మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



చల్లచింతలపూడి హౌసింగ్ డే నిర్వహిస్తున్న తహశీల్దార్ నాంచారయ్య, ఇతర అధికారులు

దెందులూరు: జగనన్న ఇళ్ల లబిబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. శనివారం చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో గృహనిర్మాణ శాఖ దెందులూరు మండల ఏపీ కావ్య ఆధ్వర్యంలో హౌసింగ్ డే నిర్వహించారు. మండల పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ చౌదరి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు కాలనీల్లోనే గోడౌన్లను ఏర్పాటు చేసి నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచారన్నారు. లబ్ధిదారులంతా త్వరతగతిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఏపీఓ దశరదరాంజీ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రాజు, వీఆర్ఓ చంద్రం, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విపక్షాల అసత్య ఆరోపణలు తిప్పికొట్టాలి



పాల్గొన్న గృహ సారథులు, వలంటీర్లు



పెదవేగి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు
- పెదవేగిలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : సీఎం జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలకు వివరిస్తూ, విపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న కుట్రలను, అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లపై ఉందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పిలుపునిచ్చారు. శనివారం పెదవేగి మండలంలోని తురాయి చెట్టు సమీపంలో నిర్వహించిన పెదవేగి, గార్లమడుగు, లక్ష్మీపురం, కొప్పులవారిగూడెం, న్యాయంపల్లి, కూచింపూడి, రామశింగవరం సచివాలయాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి విషయంలో సరికొత్త చరిత్రను సృష్టించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయడానికి గృహ సారథులను, సచివాలయ కన్వీనర్లను ఎంచుకొని మరింతగా ప్రజలకు దగ్గరయ్యే అవకాశం కల్పించారని ఎమ్మెల్యే తెలిపారు. గృహ సారథులే పార్టీ రథ సారథులుగా మారి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలను, ఆశయాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అర్హులైన పేదలకు ఏదైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే వారి సమస్యను పరిష్కరించి వారికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. మార్చి 18 నుంచి 25 వరకు ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి వారికి ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశ్యంతోనే సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజలను ఓటు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు.

అనంతరం పెదవేగి సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జి ప్రసాద్, ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎంపీటీసీ యర్రా సలోమీ, పోకల రాంబాబు, తాతా మురళి, తాతా సత్యనారాయణ మాట్లాడారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే పార్టీ శ్రేణులను స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ చాలా విలువైనది



నారాయణపురం కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: విద్యార్థి దశ చాలా విలువైనదని ఆడుతూ పాడుతూ విజ్ఞాన సముపార్జన చేయాల్సిన సమయమని ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉనికిని చాటుకునేందుకు విద్యార్థి దశ ఉపయోగించుకోవాలని సూచించారు. మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యసాధన కోసం శ్రమించాలని సూచించారు. డా.కొండా రవి, వైస్ ప్రిన్సిపల్ రెడ్డియ్య మాట్లాడారు. విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు.

మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు, మినుముల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. దెందులూరు సమీప గ్రామాల రైతులు సాగు చేసిన పెసలు, మినుములను దెందులూరులోని మార్క్‌ఫెడ్ కేంద్రంలో విక్రయించాలని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు కోరారు. పెసలు, మినుములను రైతులకు నష్టం కలగకుండా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు.

ప్రకృతి సాగుతో స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తులు



కాశిపాడులో ప్రకృతి సాగుపై అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

గణపవరం: ప్రకృతి సాగు ద్వారా స్వచ్ఛమైన ఆహార పదార్థాలు తింటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని పలువురు అన్నారు. శనివారం గణపవరం మండలం కాశిపాడులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులు వంటి రసాయనాలు వాడటం వల్ల ఆహారం విషతుల్యమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారని అందువల్ల ఆహార పదార్థాల్లో పురుగు మందుల అవశేషాలు లేకుండా పర్యావరణ హితంగా సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసి లాభాలతో పాటు ఆరోగ్యం కూడా పొందవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో డి.శ్రీలక్ష్మి, ధనబాబు, వెంకన్న, బాపూజీ, స్వాతి, హెచ్‌ఎం బి.కాంతిశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరాజు, వ్యవసాయ సహాయకుడు రవీంద్ర పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: కై కరంలో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై స్వామి తెలిపారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



వంగాయగూడెం - పెరికీడు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదపాడు: రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పరిశీలించారు. పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామానికి వెళ్తూ మార్గ మధ్యలో తోటగూడెం వద్ద చేపట్టిన రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన రహదారులు భవనాలు శాఖ ఎస్ఈ భాస్కరరావుతో మాట్లాడి నియోజకవర్గంలోని అన్ని రహదారులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని పాల్గొన్నారు.